క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



యలమంచిలి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అబ్బిరాజుపాలెం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి ఆలయంలో చాతుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు పెద్దింటి సాయి రామాచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారికి జపం, తులసి పూజ, పుష్పాలంకరణ చేశారు. చాతుర్మాస్యం దీక్ష తీసుకున్న భక్తులు ఓం నమో నారాయణాయ (కోటి అష్టాక్షరి) , ఓం నమో భగవతే వాసుదేవాయ (కోటి ద్వాదశాక్షరి) మంత్రాలు జపించగా, సాధారణ భక్తులు స్వామి వారికి భక్తితో తులసీ దళాన్ని సమర్పించి ఓం నమో వెంకటేశాయ ఓం నమో నారాయణాయ ఓం నమో భగవతే వాసుదేవాయ నామాలను స్మరిస్తూ స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ చేశారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బూసి



బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వైదాని నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసెఫ్ శనివారం విలేకరులకు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు మొత్తం 10 పదవులకు ఎన్నిక ఏకగ్రీవమైందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యుల పదవులకు నామినేషన్ వేసిన అభ్యర్థులు పోటీలో నిలిచారని ఆయన వెల్లడించారు. అలాగే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా నక్కా ఆనంద్ బాబు, లైబ్రరీ కార్యదర్శిగా నారిన శ్రీనివాసరావు, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా రాయసం రాధారాణి, కోశాధికారిగా పూరిళ్ళ శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా గోపిరెడ్డి మణి, సీనియర్ కార్యవర్గ సభ్యులుగా తంగెళ్ళ వెంకటేశ్వరరావు, కొల్లా బత్తుల చంద్ర శేఖర్, మహిళా కార్యవర్గ సభ్యులుగా ఓసూరి జ్యోతి మాంగల్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వివరించారు. మిగిలిన పదవులకు ఈ నెల 13న ఎన్నికలు నిర్వహించి అదేరోజు సాయంత్రం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.

పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: మానవత సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో శనివారం హెచ్ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు మాట్లాడుతూ ప్రతినెల రెండవ శనివారం 30 మంది హెచ్ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు, పెద్దలకు తమ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారంగా డ్రై ఫ్రూట్స్, వంటనూనె, నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఎన్ రాజు, ఆకుల మౌనిక మనోహర్, కట్రెడ్డి పెద్దిరాజు, ఇందుకూరి శివాజీ వర్మ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవికి వెండి సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పౌర్ణమిని సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారి వెండి మకర పీఠానికి శనివారం దాతలు 108 గ్రాముల వెండి విరాళంగా అందజేశారు. పట్టణానికి చినిమిల్లి ఆదినారాయణ, లక్ష్మి దంపతులు 108 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని జెపి రోడ్డులో దంతులూరు జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని శ్రీవారికి శాంతి కల్యాణ మహోత్సవం జరిపించారు. వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ కుమార్ రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణ రాజు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు మంగళం..!

- తెరుచుకోని ప్రభుత్వ సైట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- విలవిల్లాడుతున్న పేద ప్రజలు



ప్రభుత్వ పథకాల కోసం సచివాలయం చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు (ఫైల్)



యలమంచిలి మండలం మేడపాడు గ్రామ సచివాలయం

యలమంచిలి: ప్రజా సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందా అనే అనుమానం కలిగేలా ప్రభుత్వ పాలన సాగుతుందని ప్రజలు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం ఎక్కడ ఎన్నికల హామీలను అమలు చేయాల్సి వస్తుందోనన్న భయంతో ప్రభుత్వ సైట్లను తెరవడం లేదు. 2024లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సంఘం తాత్కాలికంగా ప్రభుత్వ సైట్లను మూసివేసింది. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ప్రభుత్వ సైట్లను తెరవడం లేదు. సైట్లు తెరవక పోవడంతో వివిధ పథకాల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వ సైట్లు తెరవకపోవడంతో వివిధ రకాల సేవలు, పథకాల కోసం దరఖాస్తులను అప్‌లోడ్ చేయలేకపోతున్నామని సచివాలయ ఉద్యోగులు అంటున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ, వలంటరీ వ్యవస్థను అమలులోకి తెచ్చి దాదాపు 500 సేవలను సచివాలయాల ద్వారా అమలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను పక్కనపెట్టింది. ఎన్నికల హామీలో భాగంగా రూ.5 వేల నుంచి రూ.10 వేలకు గౌరవవేతనం పెంచుతామంటూ అధికారంలోకి వచ్చిన తరువాత పెంచకపోగా విధుల నుంచి తప్పించారు. వలంటీర్లు లేకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు, సేవల కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో..?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రతి ఏడాది జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేది. 2024 ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిన తరువాత సైట్ మూతపడింది. ప్రభుత్వ సైట్లు మూసివేసే సమయానికి దరఖాస్తు చేసుకున్న పింఛన్లకు ఇప్పటి వరకు మోక్షం లభించకపోగా, సైట్లు ఓపెన్ చేయకపోవడంతో కొత్త వాటికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుడా పోయింది. రేషన్‌కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తోంది. గత ప్రభుత్వంలో సాధారణంగా చనిపోతే రూ.లక్ష, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా కింద ఆర్థికసాయం అందించేవారు. ఈ ఏడాది జూన్ 30కి గడువు ముగిసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదమైతే రూ.10 లక్షల చొప్పున సాయం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం సైటును ఓపెన్ చేయకపోవడం పట్ల బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పరిస్థితి అలాగే ఉందని, సైట్ లోని పలు ఆప్షన్లు పని చేయడం లేదని వాపోతున్నారు. పెళ్లి కానుక విషయంలోనూ ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. గత ప్రభుత్వం పేద కుటుంబాలను ఆదుకోవడానికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించింది. బీసీ కులాలకు రూ.50 వేలు, వధువరుల్లో ఎవరైన వికలాంగులు ఉంటే వారికి రూ.75 వేలు, ఎస్సీ సామాజిక వర్గానికి రూ.లక్ష, వారిలో ఒకరు వికలాంగులైతే రూ.1.5లక్షలు, బీసీ,ఎస్సీ సామాజిక వర్గాల్లో కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రెండింతలు చేస్తామని ఇచ్చిన హామీ గాలికి వదిలేసింది. ఈ విధంగా గత ప్రభుత్వంలో ప్రజలు పొందిన అనేక సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం చాప కింద నీరులా నీరు గార్చే ప్రయత్నాలు చేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సైట్లను తెరవాలి

ఎన్నికలకు ముందు మూసివేసిన పలు ప్రభుత్వ సైట్లను తెరవాలి. సైట్లను మూసి వేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తులు చేయడానికి సైట్ పని చేయడం లేదని సచివాలయ ఉద్యోగులు చెపుతున్నారు.



– విప్పర్తి నవీన్, చించినాడ

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు?

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకపోగా, గత ప్రభుత్వ పథకాల అమలుకు కూడా మోకాలడ్డుతుంది. రెండేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు కాక అనేక మంది వృద్ధులు, వితంతువులు ఇబ్బంది పడుతున్నారు.



– పెచ్చెట్టి కృష్ణాజీ, కొంతేరు

అనధికార లేఅవుట్లకు అరుదైన అవకాశం

- మొదలైన ఎల్ఆర్ఎస్ స్కీమ్
- దరఖాస్తు గడువు మూడు నెలలు
- 14 శాతం ఫీజుకు 50 శాతం రాయితీ



క్రమబద్ధీకరణ ప్రచార చిత్రం

పాలకొల్లు సెంట్రల్: పట్టణాల్లో అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా అవకాశం కల్పించింది. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పెరగడంతో రియల్టర్లు వారి ఇష్టానుసారంగా అనధికార లే అవుట్లు చేసి స్థలాలను విక్రయించారు. ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పడం, లేదంటే మునిసిపాలిటీకి కొద్దిగా అదనపు చార్జీలు కట్టుకుంటే ప్లాన్ వచ్చేస్తుందని చెప్పడంతో వారి మాటలు నమ్మి అనధికార లే అవుట్లలో అనేక మంది స్థలాలు కొనుగోలు చేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడానికి అనేక అడ్డంకులు ఎదురవ్వడంతో నిర్మాణాలు చేసుకోలేక మార్కెట్ వ్యాల్యూ మీద 14 శాతం కట్టలేక అనేక మంది స్థల యజమానులు నిర్మాణాలు చేసుకోకుండా ఆగిపోయారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులు ఎల్ఆర్ఎస్ ద్వారా తమ ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు కల్పించింది. క్రమబద్ధీకరణ అయిన లే అవుట్లలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ లైన్లు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించడానికి అవకాశం ఉంటుంది.

ఎల్ఆర్ఎస్ నోటిఫికేషన్ విడుదల

అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను జూలై 26న జీఓ విడుదల చేసింది. ఈ స్కీమ్ ద్వారా అక్టోబర్ 24 వరకూ దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అనధికార లే అవుట్లలో 10 శాతం రిజర్వు స్థలం వదలకపోతే ఆ లే అవుట్లల్లో ఉన్న మార్కెట్ విలువను బట్టి 14 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పది శాతం రిజర్వు స్థలం వదిలితే రెగ్యులరైజేషన్ చార్జీలు 1 లేక 2 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అనధికార లే అవుట్లలో ఈ ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన 14 శాతం ఫీజులో ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తుండడంతో ఏడు శాతం ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. ఈ 90 రోజులు గడువులో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న 45 రోజుల్లో మొత్తం చార్జీలు చెల్లిస్తే మొత్తం చార్జీల్లో అదనంగా మరో 10 శాతం రాయితీ ఇస్తారు. ఒకవేళ 90 రోజుల్లో చెల్లిస్తే మొత్తం చార్జీల్లో 5 శాతం రాయితీ కల్పిస్తున్నారు.

స్థానిక మార్కెట్ రేటు ప్రకారమే

అనధికార లే అవుట్లలో కొందరు లబ్ధిదారులు స్థలం కొనుగోలు చేసిన రోజు మార్కెట్ బట్టే ఎల్ఆర్ఎస్ చార్జీలు ఉంటాయనే ఆలోచనలో ఉన్నారు. కానీ ఇప్పుడు మార్కెట్ ఎంత ఉంటే ఆ ధర ప్రకారమే చార్జీలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు పదేళ్ల క్రితం అనధికార లే అవుట్లో గజం స్థలం మార్కెట్ వ్యాల్యూ ప్రకారం రూ. 5 వేలకు కొనుగోలు చేశారు. అంటే 100 గజాలకు రూ. 5 లక్షలు ఖర్చు అవుతుంది. ఆ పదేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ చేసుకుని ఉంటే 14 శాతం ప్రకారం రూ. 75 వేలు ఖర్చు అవుతుంది. అదే ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లో పెట్టుకును ఉంటే రూ. 37,500 ఖర్చు అవుతుంది. నేడు అదే స్థలం గజం ధర మార్కెట్ వాల్యూ రూ. 10 వేలు ఉంటే 100 గజాలకు పది లక్షలు అవుతుంది. నేడు క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే నేటి మార్కెట్ వాల్యూ ప్రకారం రూ. 1.40 లక్షలు అవుతుంది. అదే ఎల్ఆర్ఎస్ ద్వారా అయితే రూ. 70 వేలు అవుతుంది. ఈ ధరలను బేరీజు వేసుకుని లబ్ధిదారులు తమ అనధికార లే అవుట్ స్థలాలను వెంటనే క్రమబద్ధీకరించుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మునిసిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

పట్టణంలో సుమారు 15 లేఅవుట్లు

పాలకొల్లు పట్టణ పరిధి 4.68 కి.మీటర్లు. ఈ పరిధిలో పట్టణంలో అధికారిక లే అవుట్లు 140 ఉండగా అనధికార లేఅవుట్లు దాదాపుగా 38 వరకూ ఉన్నాయి. వీటిలో గతంలో ఎల్ఆర్ఎస్ స్కీమ్ ప్రవేశ పెట్టినప్పుడు 28 అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. ఇంకా పది అనధికార లేఅవుట్లు ఉన్నట్లు సమాచారం. వీటిలో దాదాపుగా 250 నుండి 300 ప్లాట్ల వరకూ ఉండే అవకాశం ఉందని మునిసిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇవి కాకుండా ఇంకా అనేక స్థలాలు క్రమబద్ధీకరణ చేయించుకోవాల్సినవి ఉన్నాయి. వాటిని అంచనా వేయడం కష్టమవుతుంది. వాళ్ల ప్లాన్ కోసం దరఖాస్తులు చేసుకుంటే అవి బయటకు వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారు కూడా ఈ ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ అధికారులు సూచిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలుచేసిన లబ్ధిదారులకు ఇదొక సదావకాశం. తమ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ స్కీమ్ ఎంతగానో దోహదపడుతుంది. క్రమబద్ధీకరణ చేసుకోవడం వల్ల ఆ అనధికార లేఅవుట్లలో అన్ని మౌలిక వసతులు పొందవచ్చు. భవన నిర్మాణానికి అన్ని అనుమతులు సులభంగా పొందవచ్చు. ఈ 90 రోజుల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



– బి.విజయసారథి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపితో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ



ఇన్‌చార్జి గుడాల గోపికి రాఖీలు కడుతున్న మహిళలు



వైఎస్సార్ సీపీ నాయకులకు రాఖీలు కడుతున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. శనివారం నియోజకవర్గంలో యలమంచిలి మండలం ఏనుగువానిలంక గ్రామంలో రాఖీ పండుగ సందర్భంగా పలువురు మహిళలు గోపికి రాఖీలు కట్టారు. రాఖీలు కట్టిన సోదరీమణులకు చీరలు అందజేశారు. గుడాల గోపి మాట్లాడుతూ రక్షబంధన్ అనేది సోదర సోదరీమణులకు జీవితకాలం ఒకరికి ఒకరు తోడుగా ఉంటామనడానికే రాఖీ పండుగ నిదర్శనమని అన్నారు. అలాగే ఆహ్వానం రెస్టారెంట్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ఆధ్వర్యంలో రాఖీ పండుగ ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు రాఖీలు కట్టి తమ సోదరభావాన్ని వ్యక్తపరిచారు. అనంతరం జయసరిత వారికి గిఫ్టలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల తాతాజీ, యినకొండ రవి, ఉచ్చుల స్టాలిన్, పాలపర్తి కృపానాథ్, పెచ్చెట్టి కృష్ణాజీ, వీరా మల్లిఖార్జునుడు, జోగాడ ఉమ, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, రాపాక శివకుమార్, సుబ్బారాయుడు, రామానుజుల చిన్నమధు, హేమలత, పెచ్చెట్టి విమల, పి.కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులను కలిసిన గుడాల గోపి....

వైఎస్సార్ సిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ పాలకొల్లు వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. అనంతరం రాష్ట్రంలో కూటమి పాలన అరాచకాలపై విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు జాన్ వెస్లీ కలిసి పార్టీ విషయాలను చర్చించుకున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: సోదరీ, సోదరుల బంధానికి చిహ్నంగా జరుపుకొనే రాఖీ పండుగ ఊరూవాడా ఉత్సాహంగా గడిపారు. శనివారం ఆచంట నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ మండలాల్లో అన్న, తమ్ముళ్లకు, అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకొన్నారు. అక్క చెల్లెళ్లకు నేనున్నానంటూ రక్షగా నిలుస్తామంటూ రాఖీలు కట్టారు.

ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి వేడుకలు

ఆచంట, పెనుగొండ మండలాల్లో ని ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అఖిల భారతీ శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలోనూ. మూలవిరాట్ శ్రీన గరేశ్వర మహిషాసుర మర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలోనూ చండీ హోమం వైభవంగా నిర్వహించారు. పెనుగొండ శాంతి నగర్‌లోని పద్దాల వెంకమ్మ ఆలయంలో హారతులు ఇచ్చి పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన భువన విజయం



స్థానిక ఆర్యవైశ్య కల్యాణమందిరంలో నిర్వహించిన భువన విజయం సాహితీ కార్యక్రమం

ఆకివీడు: సంస్కృతీ సాంప్రదాయాల్ని, తెలుగు భాషా ఔన్నత్యాన్ని సాటే భువన విజయం సాహితీ రూపకం కళాభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో హైందవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలనను మోటుపల్లి రామవరప్రసాద్, కాకర్ల రాజరాజేశ్వరి, బొల్లా వెంకట్రావులు, ఒలేటి శ్రీనివాస్‌లు చేశారు. కవులు, పండితులు శ్రీకృష్ణ దేవరాయుల సాహితీ సమరాంగణంలో అష్టదిగ్గజాలు ప్రదర్శించిన పాత్రలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ దేవరాయులు పాత్రలో మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, అల్లసాని పెద్దన్న, నంది తిమ్మన, ధూర్జటి, మల్లన్న, పింగళి సూరన్న, తెనాలి రామకృష్ణుడు,రామభద్రుడు, భట్టుమూర్తిల పాత్రలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. తొలుత కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు, విశ్రాంతి ఉపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని సాటే విధంగా భువన విజయం ఉంటుందన్నారు. మాతృభాష ప్రావీణ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నంలో భువన విజయం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని కాపవరం గ్రామం శివారు చింతలపాలెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. శనివారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మండలంలో తనిఖీలు చేయగా చింతలపాలెంలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించామన్నారు. పేకాట శిబిరంపై దాడి చేయగా వారి నుండి రూ. 3080 లు నగదు దొరికినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి సురేంద్రకుమార్ తెలిపారు.

రక్తదాన శిబిరం

పాలకొల్లు సెంట్రల్: సినీ హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను ఆయన ఫ్యాన్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మారుతి థియేటర్‌లో 50 మంది అభిమానులు రక్త దానం చేశారు. డాక్టర్ మిధున్ చౌదరి కొఠారి, మేడికొండ శ్రీనివాసరావు, వాడ్రేవు శ్రీనివాసరావు, పినిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని సన్నిధిలో చండీహోమం



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా శనివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండితుడు భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ హోమంలో 24 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామి వారి శేషవస్త్రం , అమ్మవారి జాకెట్ ముక్కలు, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, ఆలయ ప్రధానార్చకుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..



పెనుగొండలో చండీహోమంలో పాల్గొన్న ఆర్డీవో దాసిరాజు

పెనుగొండ: శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన చండీహోమంలో నరసాపురం ఆర్డీఓ దాసి రాజు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వడగం సత్యనారాయణ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనగా, ఆలయ ఈవో గుబ్బల రామపెద్దింట్లురావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని బాంబే స్వీట్స్ కూడలిలోని గాంధీజీ విగ్రహం వద్ద దాత పొత్తూరి బాపిరాజు చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహం ప్రాంగణంలో లాన్, మొక్కలు ఏర్పాటు, వాటర్ ఫౌంటెన్, పెయింటింగ్, బ్యాక్ డ్రాప్ పనులపై ఆరా తీశారు. ఆగస్టు 15 నాటికి చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాంబే సీట్స్ యాజమాన్యం దాత పోతూరి బాపిరాజు, తదితరులు ఉన్నారు.

వేద పండితులకు హెల్మెట్‌లు పంపిణీ

ఆకివీడు: వేదాలు వల్లిస్తూ మన సంస్కృతీ సాంప్రదాయాల్ని కాపాడుతున్న వేద పండితుల రక్షణ కోసం హెల్మెట్‌లు అందజేయడం అభినందనీయమని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక దత్త క్షేత్రంలో శనివారం జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. వేద పారాయణం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఆలయ గౌరవ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా దత్తక్షేత్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 100 మంది వేద పండితులకు హెల్మెట్‌లు అందజేశారు.